జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 4-6-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 359 పేజీలు: 4 వెల: రూ.7



# కదిలిన వైసీపీ దండు

* వెన్నుపోటు.. మీ నైజం
* ఎన్నికల ముందు హామీలు ఇచ్చి.. విస్మరిస్తుంటారు
* విద్యార్థులు, తల్లులు, మహిళలకు వెన్నుపోటు పొడిచారు
* ఏడాదిలోనే బాబు పాలనలో వైఫల్యం
* వైసీపీ శ్రేణులపై కేసులు పెట్టడమే మీ ధ్యేయం
* రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం
* వైసీపీ నేతలు కృష్ణదాస్, తమ్మినేని, తిలక్ ధ్వజం
* జిల్లావ్యాప్తంగా వెన్నుపోటు దినం
* ర్యాలీలతో హోరెత్తిన నియోజకవర్గ కేంద్రాలు
* కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు






**శ్రీకాకుళం, జూన్ 4 (వార్త):** వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి పిలుపు మేరకు శ్రీకాకుళం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ నేతలు బుధవారం వెన్నుపోటు దినం నిర్వహించారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వైసీపీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో వైఫల్యంపై నేతలు ఎండగట్టారు. చంద్రబాబు మోసకారి అంటూ ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు హామీలు గుప్పిస్తూ ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత విస్మరిస్తున్న గజనీ అని మండిపడ్డారు. ఏడాది పాలన పూర్తయినా అమ్మఒడి, రైతుభరోసా ఇవ్వకుండా వెన్నుపోటు పొడిచారన్నారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి నమ్మక ద్రోహం చేశారన్నారు. వైసీపీ శ్రేణులపై కుట్రలతో కేసులు పెట్టడమే ధ్యేయంగా కూటమి పాలన నడుస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలంటూ ప్రజలను దగా చేసిందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు వెన్నుపోటు పొడిచిన ఘనత కూటమి ప్రభుత్వానిదని ఎద్దేవా చేశారు.. జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల తరఫున వైసీపీ పోరాడుతుందన్నారు. ప్రజలను వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన చేస్తుందని మండిపడ్డారు. వైసీపీ కార్యకర్తలపై దాడులు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. శ్రీకాకుళంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఏడురోడ్ల కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి తమ నిరసనను తెలియజేశారు. అయితే మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాత్రం ఈ ర్యాలీలో పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పలాసలో మాజీమంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేశారు. కాశీబుగ్గ వైయస్సార్ కూడలి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. వైసీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆమదాలవలసలో భారీ ర్యాలీ నిర్వహించారు. మెయిన్ రోడ్డు వద్దనున్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నరసన్నపేటలో వైసీపీ యువనేత, జిల్లా పరిషత్ సభ్యుడు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య వెన్నుపోటు దినం నిరసన ర్యాలీని ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో టెక్కలిలో ర్యాలీ నిర్వహించారు. టెక్కలి వైయస్సార్ జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, పేరాడ తిలక్‌తో పాటు టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీలు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు, వైసీపీ కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జాతీయ

# వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



## వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు



**మందస, జూన్ 4(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు 65 ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేస్తామని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. వృద్ధులు, వికలాంగుల జాబితాను రేషన్ డిపోల వారీగా డౌన్‌లోడ్ చేసుకుని సమాచారంను వారికి తెలియపరచాలని రేషన్ డీలర్లను ఆదేశించారు. డిపోల వద్దకు రావద్దని వృద్ధులు, వికలాంగులకు తెలియపరచాలని డీలర్లు, వీఆర్వోలకు సూచించారు. ఒకవేళ వారి కుటుంబ సభ్యులు అందుబాటులో ఉంటే వారికి సప్లై చేయమని డీలర్లకు తెలిపారు. ఈ విషయంలో డీలర్ గానీ, వీఆర్వో గానీ నిర్లక్ష్యంగా వ్యవహరించ వద్దని ఆదేశించారు.





# ముగిసిన ఫెన్సింగ్ శిక్షణా శిబిరం

**- కోచ్ జోగిపాటి వంశీ ఆద్వర్యంలో నెల రోజుల పాటు శిక్షణ**

**- వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న ఫెన్సింగ్ క్రీడాకారులు**




**శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 4(వార్త):** శ్రీకాకుళంలోని టౌన్ హాల్ క్లబ్ వేదికగా నెల రోజుల పాటు నిర్వహించిన ఫెన్సింగ్ వేసవి క్రీడ శిక్షణా శిబిరం ముగిసింది. శ్రీకాకుళం జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని కోచ్ జోగిపాటి వంశీ పర్యవేక్షించారు. క్రీడాకారులకు బేసిక్స్ వివరించారు. మెళకువలను నేర్పించారు. వేసవి క్రీడా శిక్షణపై బాల, బాలికలు సంతృప్తి వ్యక్తం చేశారు.

# కుంభకోణాల దృష్టి మరల్చడానికే వెన్నుపోటు డ్రామాలు





**మందస, జూన్ 4(వార్త):** కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే వెన్నుపోటు డ్రామాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆడుతున్నారని టీడీపీ మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన ధ్వజమెత్తారు. హరిపురంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో తొలి ఏడాదిలో 10 శాతం హామీలను కూడా అమలు చేయలేదన్నారు. గత ఐదేళ్లలో 85% హామీలను ఎగనామం పెట్టిన ఘనత జగన్ ప్రభుత్వానిదన్నారు. కూటమి పాలనలో తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలను అమలు చేసిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు రికార్డు సాధించారన్నారు. గత ఐదేళ్లు సాగునీరు అందించలేని ఘనత అప్పలరాజుకే దక్కిందని, కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే శిరీష పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు సాగునీటిని అందించి, అపర భగీరథి అనిపించుకున్నారన్నారు. ఏడాదిలోనే నియోజకవర్గానికి సుమారు రూ.518 కోట్లు నిధులు మంజూరు చేయించి, అభివృద్ధి పథంలో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిపిన శిరీషకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి సాలిన మాధవరావు, సీనియర్ నాయకులు లబ్బ రుద్రయ్య, భైరిశెట్టి గున్నయ్య, చౌదరి మురళి, మండల లచ్చయ్య, మామిడి తాతారావు, బదకల వెంకటరావు పాల్గొన్నారు.

**పలాస, జూన్ 4(వార్త):** వైసీపీ ఇప్పటికే పతనమైందని, ప్రస్తుత చర్యలతో పాతాళానికి వెళ్లిపోయిందని టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. పలాసలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వంపై ఆరో పణలు గుప్పిస్తూ వైసీపీ నాయకులు వెన్నుపోటు దినోత్సవం నిర్వహిస్తున్నామని పేర్కొనడం అత్యంత హాస్యాస్పదంగా ఉందన్నారు. 11 సీట్లకే ప్రజలు పరిమితం చేసినప్పటికీ బుద్ధి రాలేదని తూర్పార పట్టారు. మాజీ మంత్రి అప్పలరాజు అందితే జుట్టు.. అందకపోతే కాళ్లు అనేలా వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వద్ద బాబూరావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస రావు, పలాస ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ గాలి కృష్ణారావు, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్ కుమార్, మల్లిపెద్ది నరేంద్రబాబు (చిన్ని) పాల్గొన్నారు.

# మాల యువత అభ్యున్నతే లక్ష్యం

**-రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్**



**శ్రీకాకుళం, జూన్ 4(వార్త):** రాష్ట్రంలోని మాల యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించి, వారి ఆర్థికాభివృద్ధికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం శ్రీకాకుళం కలెక్టరేట్‌లో కమ్యూనిటీ స్టేక్‌హోల్డర్స్‌తో నిర్వహించిన పరస్పర కలయికంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి కోసం అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని యువతను కోరారు. జిల్లాల వారీగా సహజ, మానవ వనరులు, నైపుణ్యాలను గుర్తించి సమగ్ర యాక్షన్ ప్లాన్‌ను రూపొందిస్తున్నామని తెలిపారు. మాల యువత భవిష్యత్తును తీర్చిదిద్దేలా కార్పొరేషన్ ప్రణాళికలు రూపొందించిందన్నారు. మార్కెట్ విశ్లేషణ (మార్కెట్ ఎనాలిసిస్) చేసి, తగిన రంగాల్లో యూనిట్లు ఏర్పాటు చేయడానికి సూచ నలు స్వీకరిస్తున్నామన్నారు. సమావేశంలో పాల్గొన్న పలువురు మాల కార్పొరేషన్ డైరెక్టర్లు, సభ్యులు జిల్లా వెనుకబాటుతనాన్ని ప్రస్తావించారు. జిల్లాలో మాలలు, మాల అనుబంధ కులాల జనాభా సుమారు 70 శాతం ఉందని గుర్తు చేస్తూ, యువతకు ఉపాధి కల్పించాలంటే యూనిట్ వర్గీకరణ తప్పనిసరి అని సూచించారు. గతంలో ఇచ్చిన రుణాల రద్దు, హాస్టళ్ల మూసివేత వల్ల యువత ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పథకాలపై విస్తృత ప్రచారం అవసరమని, అర్హులైన లబ్ధిదారులకు సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భూములు కోల్పోయిన మాలలకు భూములు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గడ్డెమ్మ, పలువురు అధికారులు, కార్పొరేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**మందస, జూన్ 4(వార్త):** మందసలోని గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు గ్రంథాలయాధికారిణి జె.విజయలక్ష్మి బుధవారం నిర్వహించారు. స్వర్ణాంధ్ర అనే అంశంపై ఉపాధ్యాయుడు టి.జయరాం పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, స్థానికులు పాల్గొన్నారు.

## శ్మశానవాటికలో.. మొక్కలు నాటిన సొండిపూడి యువత




**మందస, జూన్ 4(వార్త):** గోవిందపురం గ్రామం సమీపంలోని శ్మశాన వాటికను సొండిపూడి అంబేద్కర్ యువత బుధవారం బాగు చేసి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర బాధ్యుడు మిస్క కృష్ణయ్య, స్థానిక పెద్దలు బోనెల నాగేశ్వరావు, సొండిపూడి అంబేద్కర్ యువత పాల్గొన్నారు.

## వైఎస్సార్ క్రీడా పాఠశాలకు దరఖాస్తు చేయండి

**శ్రీకాకుళం, జూన్ 4(వార్త):** కడపలో ఉన్న వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం 4, 5వ తరగతిలో చేరుటకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఎస్‌డీవో శ్రీధర్ తెలిపారు. ఈ నెల 19 వరకు దరఖాస్తుకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు apsportsschool.ap.gov.in వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేయాలని సూచించారు. వివరాలకు ఉపేంద్ర, 9885096739 సెల్ నెంబర్ నందు సంప్రదించాలని కోరారు.

## అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న మున్సిపల్ సిబ్బంది



**పలాస, జూన్ 4(వార్త):** అక్రమ నిర్మాణాన్ని ఎవరు చేపట్టినా.. సహించేది లేదని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు హెచ్చరించారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలోని కేటీ రోడ్, పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా నిర్మిత మవుతున్న అక్రమ భవన నిర్మాణాన్ని నిలిపేయాలని, తహసీల్దార్ టి కళ్యాణ్ చక్రవర్తి సదరు బిల్డింగ్ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కానీ ఆ భవన యజమాని పనులు జరుపుతుండగా, ఈ పురపాలక సంఘ టౌన్ ప్లానింగ్ అధికారి వరభూషణరావు, సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి ఆ పనులను నిలిపేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రామారావు మాట్లాడుతూ ఎవరైనా అక్రమ నిర్మాణాలను చేపడితే, సదరు బిల్డింగ్ యజమానులపై కేసులు వేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట టౌన్ ప్లానింగ్ సిబ్బంది ప్రేమ్, జి.శ్రీనివాసరావు ఉన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన జనసేన నాయకులు

**మందస, జూన్ 4(వార్త):** రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెద్దపూడి విజయ్‌కుమార్‌ని జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ కార్పొరేషన్ రివ్యూ మీటింగ్ కోసం వచ్చిన సందర్భంగా శ్రీకాకుళంలోని సన్ రైజ్ హోటల్‌లో ఆయనను కలిసిన వారిలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు, నీటి సంఘాల అధ్యక్షుడు పైల నాగార్జున, రుంకు తారకేశ్వరరావు, హనుమంతు జనార్దన ఉన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఐదు లక్షల మొక్కలు నాటాలి

**శ్రీకాకుళం, జూన్ 4(వార్త):** ప్రకృతి పరిరక్షణకు కట్టుబడి, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఐదు లక్షల మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ప్రతి శాఖ, ప్రతి మండలానికి స్పష్టమైన లక్ష్యాలు ఉన్నాయని, సహకరించకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అటవీ శాఖ 1.5 లక్షల మొక్కలు, సచివాలయ సిబ్బంది లక్ష, జిల్లా పంచాయతీ శాఖ 90,000, ఐసిడిఎస్ ప్రతి అంగన్‌వాడీలో కనీసం 10 చెట్లు, పీడీ డ్వామా సిబ్బంది 2.50 లక్షలు మొక్కలు, ఇతర శాఖలకు మరో 50 వేల మొక్కలు నాటాలని లక్ష్యాలు నిర్దేశించారు. అటవీశాఖ, ఉద్యానవన శాఖ, కాలుష్య నియంత్రణ మండలి వంటి కీలక విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ మహత్తర కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములై, విజయవంతానికి తోడ్పడాలని ఆయన కోరారు.



## శాసనేశ్వరి అమ్మవారి క్షీరాధివాసం

ఇచ్ఛాపురం, జూన్ 4(వార్త): నైమిశారణ్య పీఠాధిపతులు బాల బ్రహ్మానంద సరస్వతీ నేతృత్వంలో మావుడూరు రాంప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో గ్రామ పూజా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పాత శాసనం గ్రామంలోని శాసనేశ్వరి ఆలయ ప్రతిష్టలో భాగంగా క్షీరాధివాసం నిర్వహించారు. ఎంపీడీవో రామారావు పూజల్లో పాల్గొని వేద పండితుల ఆశీస్సులు తీసుకున్నారు, మండపార్చనలు, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, స్నపనం, మూలమంత్ర సహిత సర్వదేవత హవనములు, మూర్తి హోమం, అంగహోమం, స్పర్శ హోమం, కళా హోమం, పంచశయ్యాధివాసం, నీరాజన మంత్రపుష్పములు, చతుర్వేద పారాయణ, స్వస్తి నిర్వహించారు.

## శక్తి యాప్ మహిళలకు అభయాస్త్రం

**శ్రీకాకుళం, జూన్ 4(వార్త):** శక్తి యాప్ మహిళలకు అభయాస్త్రంగా పని చేస్తుందని, ప్రతి ఒక్క మహిళ, విద్యార్థులు ఫోన్ లో శక్తి యాప్ డౌన్లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శక్తి టీమ్ సభ్యులు అన్నారు. బుధవారం వారు కళాశాలలు, రైల్వేస్టేషన్లో, బస్టాండ్, ఇతర పబ్లిక్ ప్రదేశాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఈ యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత ప్రయోజనాలు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ యాప్ ద్వారా పోలీస్ వారి తక్షణ సహాయం పొందాలని సూచించారు.

## ఘనంగా వెంకటరావుయాదవ్ జన్మదిన వేడుకలు



**మందస, జూన్ 4(వార్త):** మూలిపాడు గ్రామానికి చెందిన మూలిపాడు సర్పంచ్, యాదవ సంఘం జిల్లా నాయకుడు గుసిరి వెంకటరావుయాదవ్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పంచాయతీని అభివృద్ధి పథాన నడిపిస్తున్న ఆయనకు పలువురు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. యువకునిగా, సర్పంచ్ గా, ఆధ్యాత్మికవేత్తగా, కమ్యునిస్ట్ భావాలు కలిగిన నాయకునిగా, సోషల్ వర్కర్ గా, యాదవ కుల సంఘం నాయకునిగా మంచి గుర్తింపు పొందిన వెంకటరావుయాదవ్ తన పుట్టినరోజు సందర్భంగా గ్రామంలో గల ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. సోషల్ మీడియాలో పలువురు శుభాకాంక్షలు తెలియజేయగా, మందస ఎంపీటీసీ కంచి బెహరాతో పాటు సార దూర్వాసులు, సీతారాంబెహరా, బైలాడు సైనీ, నాగుబెహరా, దట్టి నీలయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు మధ్య ఆయన కేక్ కట్ చేసి, జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.

## టిడ్కో లబ్ధిదారులు ఆందోళన చెందొద్దు



**పలాస, జూన్ 4(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అర్బన్ హౌసింగ్ గ్రీవెన్స్‌లో ఇళ్ల నిర్మాణాలు, టిడ్కో ఇళ్ల కేటాయింపులకు సంబంధించి పలు దరఖాస్తులు వచ్చాయని కమిషనర్ రామారావు తెలిపారు. అర్బన్ లే అవుట్ల లబ్ధిదారులు ఇళ్ల బిల్లులు, ఇసుక వంటి సమస్యల పై దరఖాస్తు చేశారన్నారు. 12 దరఖాస్తులు రాగా, వివిధ శాఖాధికారులతో స్వయంగా కమిషనర్ మాట్లాడి పరిష్కరించారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఇంకా రావాల్సి ఉందని, డిపాజిట్‌దారులు ఆందోళన చెందవద్దని ఆయన స్పష్టం చేశారు. అర్బన్ హౌసింగ్‌కి సంబంధించి లబ్ధిదారులకు ఏ సమస్య ఉన్నా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## పదవీకాలంలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

**పలాస, జూన్ 4(వార్త):** ఉద్యోగ కాలంలో ప్రజలకు అందించిన సేవలే చిరకాలం గుర్తింపునిస్తాయని పలువురు వక్తలు అన్నారు. సాసుమాన రామినాయుడు ఇటీవల పదవీ విరమణ చేయడంతో గరుడఖండి గ్రామంలో గ్రామపెద్దల ఆధ్వర్యంలో బుధవారం అభినంధన సభ నిర్వహించి రామినాయుడు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సాసుమాన రామారావు, సాసుమాన విద్యాసాగర్, సాసుమాన చంద్రమౌళి, సాసుమాన వేణుగోపాలరావు, సాసుమాన జోగారావు, ఉప్పాడ రమేష్, వెంకటాచలం, దుంపల సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



# పలాసలో అరాచక పరిపాలన

- ప్రశ్నించేవాడిని కేసులతో భయపడుతున్నారు
- మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- వెన్నుపోటు దినం విజయవంతం

**పలాస, జూన్ 4(వార్త):** ప్రజలను మోసం చేసి, ద్రోహం చేశారని, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెల కొందని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం పలాసలో నిర్వహించిన వెన్నుపోటు ర్యాలీకి పెద్ద సంఖ్యలో వైకాపా శ్రేణులు హాజరు కావడంతో విజయవంతమైంది. ఈ సందర్భంగా కాశీబుగ్గ వైఎస్ఆర్ కూడలి వద్ద వైఎస్ విగ్రహానికి మాజీ మంత్రి సీదిరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాశీబుగ్గ నుంచి పలాస వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. నిరసన విజయవంతమవ్వడం, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల ఆగ్రహానికి నిలువెత్తు నిదర్శనమని అప్పలరాజు అన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి



నెడుతున్న తీరుపై ప్రజలు విసు గెత్తిపోయారని ధ్వజమెత్తారు. సేవ్ పలాస, సేఫ్ పలాస నినాదంతో అధికారంలోకి వచ్చి ఇసుక, కంకర, మట్టి లారీలపై రూ.300లు చెప్పున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మద్యం సీసా పై 30 రూపాయలు అదనంగా అల్లుడు ట్యాక్స్ విధించి మందుబాబుల నుంచి దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో శిష్టు గోపి, ఉంగ సాయి, పైల చిట్టి, బోర బుజ్జి, దువ్వాడ మధుకేశ్వరరావు, అంబటి ఆనంద్, గుజ్జ జోగారావు, దానయ్య, పీవీ సతీష్, పి.హరి, దువ్వాడ రవి, బమ్మిడి సంతోష్, బత్తిన హేమేశ్వరావు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# 12న పలాసలో మెగా జాబ్ మేళా

**పలాస, జూన్ 4(వార్త):** నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 12న మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. బుధవారం ఆమె తన క్యాంపు కార్యాలయంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్‌తో కలిసి జాబ్ మేళాపై రూపొం దించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కాశీబుగ్గలోని సూర్య తేజ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 12న ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. డాక్టర్ రెడ్డీస్, దివిస్, హెట్రో, డైకిన్, టీఏఓ డిజిటల్ ఇండియా వంటి బహుళజాతి సంస్థలు సహా మొత్తం 15 ప్రైవేట్ కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటున్నాయని, దాదాపు 800 ఉద్యోగ ఖాళీల భర్తీ చేయనున్నామన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఫార్మసీ చదివి, 18-30 ఏళ్ల



నిరుద్యోగులకు ఇది మంచి అవకాశం అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ మాట్లాడుతూ... అభ్యర్థులు తప్పని సరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమే, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్స్, జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9908590730, 6301045132 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# కూటమి పాలనపై వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- టీడీపీ శ్రేణులకు పలాస ఎమ్మెల్యే శిరీష పిలుపు

**పలాస, జూన్ 4(వార్త):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతుంటే.. వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని, దీనిని పార్టీ శ్రేణులు ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో, పంచాయతీల్లో, పట్టణాల్లో టీడీపీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. బుధవారం ఆమె పలాస టీడీపీ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటైన టీడీపీ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులతో, కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. పలాస నియోజకవర్గం కూటమి ప్రభుత్వ



హయాంలో అభివృద్ధి చెందుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వదిలేసిందని విమర్శించారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తేవాలని కోరారు. సమావేశంలో మందస, పలాస, వజ్రపు కొత్తూరు మండల స్థాయి కమిటీలు, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కమిటీ, పార్టీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



### శిరీషను సన్మానించిన అండమాన్ టీడీపీ నాయకులు

**పలాస, జూన్ 4(వార్త):** పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను అండమాన్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ నాయుకులు బుధవారం ఘనంగా సన్మానించారు. అండమాన్ టీడీపీ కార్యదర్శి బొడ్డు కాంతారావు, జాయింట్ సెక్రటరీ పోతనవల్లి దుష్యంత్, కార్యకర్త బొడ్డు పాపారావు పలాసకు శిరీష చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వీరుకట్ల విఠల్, కుత్తుమ లక్ష్మణకుమార్, మురిపింటి కుమారరాజా, వుచ్చ భాస్కరరావు, కుత్తుమ మాధవరావు, రాపాక పురుషోత్తం, కుత్తుమ ప్రకాష్, ప్రసాద్, రాము, కిక్కిరి ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జిల్లావ్యాప్తంగా వైసీపీ శ్రేణులు బుధవారం వెన్నుపోటు దినం నిర్వహించారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నిరసనల హోరు














Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546